

చలో నల్లగొండ బహిరంగ సభలో ఉద్యమ పిడికిలి బిగించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

మా నీళ్లు మాకే కావాలనే ఆకాంక్ష. నీటి హక్కుల కోసం పోరాటం. అభిమాన నేత కేసీఆర్‌ను చూడాలనే ఆరాటం. ఆకాశాన్నంటే అభిమానం. ఉరకలెత్తే ఉత్సాహం. మెడలో గులాబీ కండువా. చేతిలో బీఆర్ఎస్ జెండా. జై కేసీఆర్. జై తెలంగాణ నినాదాల హోరు. దారిపొడవునా వాహనాల్లో మార్మోగిన తెలంగాణ పాటలు. వెరసి జనసంద్రంగా మారిన నల్లగొండ పరిసరాలు. మర్రిగూడ బైపాస్ రోడ్డులో విశాలమైన సభా ప్రాంగణం భారీ జన సందోహంతో కిటకిటలాడింది. మంగళ వారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మొదలైన జనప్రవాహం సాయంత్రం ఐదు గంటల వరకు సాగింది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగానికి జనం నుంచి వెల్లువెత్తిన స్పందనతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. నాటి ఉద్యమ రోజులను గుర్తు చేసేలా సాగిన చలో నల్లగొండ సభ సూపర్ సక్సెస్ అయ్యింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చిన తొలి సభ దిశానిర్దేశం చేస్తూ సాగడంతో పార్టీ శ్రేణులకు బూస్టర్‌గా నిలువనున్నది.

*– నల్లగొండ ప్రతినిధి/ సూర్యాపేట, (నమస్తే తెలంగాణ) ఫిబ్రవరి 13*

# జల గర్జన

## చలో నల్లగొండ సభ సూపర్ సక్సెస్



కేసీఆర్ ప్రసంగానికి చప్పట్ల హోరు

- జన సంద్రంగా నల్లగొండ పరిసరాలు
- సభకు వచ్చిన వాహనాలతో కిక్కిరిసిన రహదారులు
- ఎటు చూసినా గులాబీ రెపరెపలే
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులు.. ప్రత్యేక ఆకర్షణగా యువత
- మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్ ప్రసంగానికి అపూర్వ స్పందన
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఫుల్ బూస్టప్‌గా నిలిచిన సభ

### కేసీఆర్‌కు చేతులెత్తి స్వాగతం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సభకు హాజరైన జనం ఘన స్వాగతం పలికారు. సాయంత్రం 4.45 గంటలకు హెలికాప్టర్‌ను చూసిన జనం ఈలలు, కేరింతలతో భారీ సందడి చేశారు. ఆయన సభా వేదికపైకి చేతికర్రతో ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తుండగా మధ్యలోనే జనం సందడి చూసి కేసీఆర్ అభివాదం చేయడంతో ప్రతిగా జనం చప్పట్లు కొడుతూ చేతులెత్తి జై కేసీఆర్ అంటూ స్వాగతించారు. ఇక వేదిక ఎడమ వైపున ఉన్న జనాలకు అభివాదం చేస్తూ మధ్యలోకి రాగానే రెండు చేతులు జోడించి నమస్కరించారు. వేదిక కుడి వైపునకు వచ్చి అటువైపున ఉన్న అభిమానులకు సైతం అభివాదం చేయడంతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. తమ అభిమాన నేత చేతి కర్రతో నడుస్తూ ఉండడాన్ని చూసి కొందరు చలించిపోయారు. ఇక కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం కాంగ్రెస్ సర్కార్‌పై పంచ్ డైలాగ్‌లతో భవిష్యత్ కర్తవ్యాలను గుర్తుచేస్తూ సాగింది. కేసీఆర్ ప్రసంగం కొనసాగిన 40 నిమిషాలపాటు సభా ప్రాంగణం హోరెత్తింది. ఈ మధ్యకాలంలో జరిగిన కేసీఆర్ సభల్లో ఇదో బ్రహ్మాండమైన సభగా పార్టీ సీనియర్లు అభివర్ణిస్తున్నారు.



నల్లగొండలో బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరైన జనం



ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### దారులన్నీ నల్లగొండ వైపే...

కృష్ణా జలాల హక్కుల సాధన కోసం మర్రిగూడ బైపాస్‌లో నిర్వహించిన చలో నల్లగొండ సభకు జనం నుంచి అపూర్వ స్పందన లభించింది. మాజీ సీఎం కేసీఆర్ పాల్గొంటున్న సభ కావడంతో నలుదిక్కుల నుంచి నల్లగొండకు వచ్చే దారులన్నీ కిక్కిరిసిపోయాయి. పల్లె, పట్నం తేడా లేకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కృష్ణా జలాలతో సంబంధం ఉన్న ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కూడా ప్రజలు, రైతులు సభకు ఉత్సాహంగా తరలి వచ్చారు. నార్కట్‌పల్లి–అద్దంకి హైవే సభకు వచ్చే వాహనాలతో గులాబీమయంగా మారింది. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సభకు వచ్చే వాహనాలే కనిపించాయి. పార్టీ శ్రేణులతో పాటు రైతులు, యువత పెద్ద సంఖ్యలో సభలో పాల్గొన్నారు. ఇక బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయి నుంచి గులాబీ జెండాలు, కండువాలు ధరించి జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలతో సందడి చేస్తూ కదిలి వచ్చాయి. బైక్‌లపై తరలొచ్చిన యువత కూడా పెద్ద సంఖ్యలో కనిపించింది. సభా ప్రాంగణం సాయంత్రం నాలుగు గంటల వరకే నిండిపోయింది. కేసీఆర్ సభా ప్రాంగణానికి చేరుకునే సరికి సభా స్థలంతోపాటు హైవే వెంట కూడా బారులు తీరి కనిపించారు. కేసీఆర్ హెలికాప్టర్ చూసిన జనం కేరింతలు కొడుతూ సభా స్థలంలోకి చొచ్చుకువచ్చారు.

### ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

సభకు వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటిలాగే బీఆర్ఎస్ అన్ని ఏర్పాట్లు చేసింది. వేల సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా వీలైనన్నీ పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆయా పార్కింగ్ ప్రదేశాల్లో తమ వాహనాలను దిగి ప్రజలు నడుచుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఇతర ప్రయాణికులకు సైతం ట్రాఫిక్ ఇబ్బందులు కూడా పెద్దగా తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఇక ఎండ తీవ్రత ఉండడంతో సభకు వచ్చిన వారికి ఇబ్బంది లేకుండా అడుగడుగునా మంచినీళ్ల ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేయడంతో సభా ప్రాంగణం అన్ని వైపులా జనంతో నిండిపోయింది. సభ కోసం 500 మందితో పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. సభ వేదికను విశాలంగా నిర్మించడంతో రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన ముఖ్య నేతలంతా వేదికపైన ఆసీనులయ్యేలా అవకాశం కల్పించారు.

### అన్నీ తానై వ్యవహరించిన జగదీశ్ రెడ్డి

ఉద్యమ కాలం నుంచి నేటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎంతటి సభనైనా ప్రణాళికాబద్ధంగా నడిపించడంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దిట్ట. మంగళవారం నాటి చలో నల్లగొండ బహిరంగ సభను సక్సెస్‌ఫుల్‌గా నడిపించడంలోనూ ఆయన అన్నీ తానై వ్యవహరించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలతో కలిసి గత వారం రోజులుగా సభ ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు.

నియోజకవర్గాల వారీగా జన సమీకరణ ప్లాన్‌తో పాటు సభ ఏర్పాట్లల్లోనూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా నడిపించారు. సభకు భారీగా జనం తరలిరావడం, అందుకు అనుగుణంగా కేసీఆర్ ప్రసంగం కొనసాగడం, జనం నుంచి భారీ స్పందన రావడం.. ఇలా అన్నీ కలిసి చలో నల్లగొండ సభ మరో చారిత్రాత్మక సభగా నిలువనుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ చైర్మన్లు బండ నరేందర్‌రెడ్డి, గుజ్జ దీపిక, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గొంగిడి సునీత, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, నోముల భగత్, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి నాయకులు రాంచందర్ నాయక్, రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు వివిధ జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

### నల్లగొండ గులాబీమయం

బీఆర్ఎస్ బహిరంగ సభతో నల్లగొండ గులాబీ మయమైంది. ఎక్కడ చూసినా గులాబీ జెండాలు, తోరణాలు దర్శనమిచ్చాయి. పెద్ద ఎత్తున కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ బీఆర్ఎస్ నేతలు ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. నల్లగొండ పట్టణంతో పాటు నార్కట్‌పల్లి, తిప్పర్తి, నకిరేకల్, మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్ రూట్లలో అడుగడుగునా జెండాలు, ఫ్లెక్సీలు, కటౌట్లు కనిపించాయి. బీఆర్ఎస్ శ్రేణులు చేతిలో గులాబీ జెండాలు, తలకు టోపీలు ధరించి సభకు తరలి వచ్చారు. దీంతో సభా ప్రాంగణంలో ఎటూ చూసినా గులాబీమయంగా మారింది.

### జోర్దార్.. ధూంధామ్..

సభలో కళాకారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ధూంధాం పాటలు సభికులను ఉర్రూతలూగించాయి. కళాకారుల బృందం ఆటపాటలకు అంతా ముగ్ధులయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలు, మరిచిన హామీల అమలును పూస గుచ్చినట్టు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమర్థంగా అమలైన పథకాలను కాంగ్రెస్ పాతరేయడంపై పాడిన పాటలు ఆలోచింపజేశాయి. సభకు మహిళలు బతుకమ్మలు, కోలాటాల ప్రదర్శనలతో తరలివచ్చారు. మిట్టపల్లి సురేందర్, మానుకోట ప్రసాద్ లాంటి గాయకుల నేతృత్వంలో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలను సభికులను ఉర్రూతలూగించాయి.

### కేసీఆర్ పర్యటన సాగిందిలా..

- *సాయంత్రం 4.45 గంటలకు కేసీఆర్ హెలికాప్టర్ రాక*
- *4.48గంటలకు హెలికాప్టర్ దిగి వాహనంలో ప్రయాణం*
- *4.58 సభా వేదిక మీదకు కేసీఆర్ అడుగులు*
- *5.01గంటలకు వేదికపై కుర్చీలో ఆసీనులు*
- *5.09 గంటలకు కేసీఆర్ ప్రసంగం మొదలు*
- *5.48 గంటలకు ప్రసంగం ముగింపు*
- *6.00గంటలకు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం*



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వేదికపై పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు

### సభ పెడుతున్నారని తెలిసి కాంగ్రెసోళ్లకు వణుకు పుట్టింది

కేసీఆర్ నల్లగొండకు వచ్చి ఏం చేశాడనే వెధవలకు సమాధానం ఏంటంటే.. మీరు పెంచి పోషించిపోయిన కరువును ప్రజలకు దూరం చేశారు. ఆకలి చావులను దూరం చేశారు. యాభై ఏండ్లు పెంచి పోషించి రెండున్నర లక్షల మందిని బలి తీసుకున్న ఫ్లోరోసిస్‌ను ఆరేండ్లలోనే దూరం చేశారు. తెలంగాణ వచ్చే నాటికి ఉమ్మడి జిల్లాలో మూడు లక్షల టన్నుల ధాన్యం పండడమే మహా గగనం. బీఆర్ఎస్ పాలనలో నాలుగేండ్లలోనే నలభై లక్షల టన్నుల ధాన్యం పండుతున్నది. మీరు జిల్లాను ఖరాబ్ చేస్తే కేసీఆర్ వచ్చినంక మార్చాం. ఇవన్నీ కనిపించని చెత్త నాయకులు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పాలన వచ్చినంక జరిగిన మార్పేంటంటే 24 గంటల కరెంటు మాయం. ఉమ్మడి జిల్లాకు కేసీఆర్ పది లక్షల ఎకరాలకు సాగు నీళ్లు ఇస్తే వాటిని మాయం చేసి ఐదారు లక్షలకు తెచ్చారు. కేసీఆర్ ఏం తెచ్చారో ఒక్కసారి లెక్క లేసుకుంటే అర్థమవుతది. తెలంగాణ ఆత్మ ఉంటే కదా ఎవరికైనా అర్థమయ్యేది. ఒక్కనాడైనా ఎవ్వడైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటే కదా అర్థం చేసుకునేందుకు. రెండు నెలలుగా నాగార్జునసాగర్ అవతలోని చేతికి పోతే ఒక్కడైనా మాట్లాడలేదు. నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ నల్లగొండలో కేసీఆర్ సభ పెడుతున్నారని కాంగ్రెసోళ్లకు వణుకు పుట్టి ఇవ్వాళ మేల్కొని సోయి తెచ్చుకున్నరు. ఉద్యమం షురూ అయ్యింది. తస్మాత్ జాగ్రత్త! ప్రభుత్వం సక్రమంగా నడపండి.. మేం సహకరిస్తాం. తప్పులు చేస్తే తోడ్కు తీస్తాం.



*–మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి*

## ఉద్యమ రోజులను గుర్తుకు తెచ్చిన కేసీఆర్

**కేసీఆర్ పంచులకు... కేరింతల హోరు**

**జై తెలంగాణ నినాదాలతో మార్మోగిన సభ**

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి13(నమస్తే తెలంగాణ) :చలో నల్లగొండ బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగం కాంగ్రెస్ సర్కార్‌పై పదునైనా విమర్శలు, వ్యంగ్యాస్త్రాలు, పంచు డైలాగ్‌లతో సాగింది. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూనే ప్రజలను అప్రమత్తం చేసేలా సాగిన కేసీఆర్ ప్రసంగం జనాన్ని ఉర్రూతలూగించింది. కేసీఆర్ ప్రసంగం కొనసాగిన సుమారు 40 నిమిషాల పాటు సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. ఉద్యమ కాలం నాటి కేసీఆర్ ప్రసంగాలు మరోసారి మదిలో మెదిలాడాయని పార్టీ సీనియర్ నేతలు వ్యాఖ్యానించారు. కేసీఆర్ చేతికర్రతో వేదిక మీదకు అడుగులు వేస్తుండగానే పెద్దఎత్తున చప్పట్లు, ఈలలు, కేరింతలతో స్వాగతం పలుకగా కేసీఆర్ మెట్ల మీదనే ఆగి అభివాదం చేయడంతో చేతులెత్తి సభికులంతా ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ తన ప్రసంగాన్ని మొదలుపెడుతూ మీ అనుమతితో కూర్చుని మాట్లాడుతానని అడుగడంతో చప్పట్లతో సమ్మతి తెలిపారు. ప్రసంగం ఆరంభంలో వేదికకు ఓ వైపు నుంచి యువత సీఎం సీఎం అంటూ నినాదాలు చేయడంతో కేసీఆర్ వారికి ఊరుకోవాలంటూ పలుమార్లు సైగ చేశారు. కృష్ణా బోర్డుపైనే ప్రసంగాన్ని మొదలుపెడుతూ బీఆర్ఎస్‌తోనే నల్లగొండను జీరో ఫ్లోరైడ్ జిల్లాగా మారిందనడంతో చప్పట్లు మార్మోగాయి. నల్లగొండలో లక్షల టన్నుల నీళ్లు అందించిన ఘనత మనదేనన్నప్పుడు అవును.. అవును అంటూ సభ నుంచి ప్రతిస్పందన లభించింది.

### పులుల్లాగా కొట్లాడాలి..

దేనికైనా దమ్ము కావాలి... చేయాలి అనే తపన ఉండాలి అని అన్నారు. 'ట్రిబ్యునల్ ముందుకు పోయి గట్టిగ కొట్లాడాలి.. మా వాటా ఇంత రావాలి అని కొట్లాడాలి.. అది మొగోడు చేయాల్సిన పని' అని కాంగ్రెస్ సర్కార్‌పై విరుచుకుపడడంతో సభ దద్దరిల్లిపోయింది. పాలిచ్చే బర్రెను అమ్మి దున్నపోతును ఎందుకు తెచ్చుకున్నరో అనడంతో నవ్వులు విరిశాయి. అసెంబ్లీలో హరీశ్ రావు గర్జించి నిలబెట్టి గట్టిగా అడిగారనగానే చప్పట్లు, ఈలల మోతమోగింది. 'నా కట్టె కాలేంత వరకు తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేస్తా... పులిలాగే లేచి కొట్లాడతా' అని కేసీఆర్ ప్రకటిస్తే జనం కేరింతలు కొట్టారు. 'పిడికిలి బిగించాలి.. కేంద్రాన్ని నిలదీయాలి... పుల్లుల్లాగా కొట్లాడాలి' అని పిలుపునిస్తే చేతులెత్తి సమ్మతి తెలిపారు. 'ఎవ్వరి అధికారం శాశ్వతం కాదు... తెలంగాణ హక్కులు శాశ్వతం అవునా.. కాదా అని' ప్రశ్నిస్తే అవునని సభికుల నుంచి సమాధానం వచ్చింది. దద్దమ్మల రాజ్యం ఉంటే అట్లనే ఉంటదన్న కేసీఆర్ కామెంట్‌కు చప్పట్లు మార్మోగాయి. 'అసెంబ్లీలో జనరేటర్ పెట్రిండ్రు. రైతు బంధు ఇవ్వలేక చేతులెత్తేశారు... రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతా అంటారు... పంటలు పండించే రైతులకు చెప్పులు ఉంటాయి. అవి మీ చెప్పులకంటే గట్టిగుంటయ్' అని హెచ్చరించగా సభ కేరింతలు కొట్టింది. 'కేసీఆర్‌ను తిరుగనియ్యం.. అంత మొగోళ్లా వీళ్లు.. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌నే అడ్డుకుంటావా.. సంపుతవా... టచ్ చెయ్ చూద్దాం' అని సవాలు చేస్తే సభ దద్దరిల్లింది. 'ఏదన్న పోతే సదరాలి.. సక్కగా చేసి నీళ్లు ఇవ్వాలి... అధికారం శాశ్వతం కాదు' అనిహితవు పలికారు. 'ఇది లేచిన తెలంగాణ.. టైగర్ తెలంగాణ.. కొట్లాడుదాం... పోరాటం చేద్దాం... డబుల్ స్పీడ్‌తో తిరిగి అధికారంలోకి వస్తాం' అని కేసీఆర్ ప్రకటించగా సభ ఒక్కసారిగా అరుపులు, కేకలతో మార్మోగింది.

### తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం



కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ఎప్పటికైనా కేసీఆర్‌తోనే సాధ్యం. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారెంటీలు అమలయ్యేదాకా తెలంగాణ ప్రజల ప్రక్షాన కేసీఆర్ అండగా ఉండి పోరాడుతాడని చలో నల్లగొండ సభతో నమ్మకం ఏర్పడింది. పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం చూస్తుంటే మళ్లీ మంచి రోజులు వస్తాయని నమ్మకం ఉన్నది.

– భూక్యా నవీన్, కోదాడ

### తెలంగాణ ప్రజల గుండె ధైర్యం కేసీఆర్ సార్



కృష్ణా జలాల కోసం కేసీఆర్ సార్ తలపెట్టిన చలో నల్లగొండ సభకు ఎంతో ఉత్సాహంతో వచ్చా. కేసీఆర్ సార్‌ను చూశాకనే నా ప్రాణం నిమ్మల పడ్డది. తెలంగాణ ప్రజల పక్షాన అధికారంలో ఉన్నా, లేకున్నా కొట్లాడేది ఒక్క కేసీఆరే. ఇయ్యాల ఈ సభకు వచ్చిన జనాన్ని చూస్తుంటే ఉద్యమ కాలంలో కేసీఆర్ చేసిన పోరాటం గుర్తుకు వచ్చింది.

– యాకూబ్, ఆత్మకూర్ (ఎస్), సూర్యాపేట జిల్లా

### మస్తు జనం వచ్చిండ్రు



కేసీఆర్ సభకు మస్తు జనం రావడంతో పానగల్ బైపాస్ నుంచి మర్రిగూడ బైపాస్ వరకు వాహనాలు బారులుదీరి కనిపించాయి. ఇప్పుడు పాలిస్తున్నా కాంగ్రెసోళ్లకు పాలన పట్ల అవగాహన ఉన్నట్లు కనిపిస్తలేదు. గతంలో పుష్కలంగా పంటలకు నీళ్లు వచ్చినయి. మస్తుగా పంటలు పండినయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేసీఆర్ సార్ చెప్పిన నీళ్ల కొట్లాట ముచ్చటలో కాంగ్రెసోళ్లు దొంగలు అని తేలింది.

– మేడిదుల్ల ఐలయ్య, పానగల్, నల్లగొండ



నల్లగొండ సభకు వాహనాల్లో పెద్ద ఎత్తున తరలి వస్తున్న జనం

### 14న ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక

నకిరేకల్, ఫిబ్రవరి 13 : ఈ నెల 14న నకిరేకల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళపల్లిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మెన్, ఉమెన్, జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19 వరకు కరీంనగర్ జిల్లాలో జరిగే 52వ సీనియర్ మెన్, ఉమెన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, 10వ తరగతి మార్కుల మెమో వెంట తీసుకొని రావాలని, ఇతర వివరాలకు 9705794159 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

### నేటి నుంచి చెర్వుగట్టు జాతర

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 13 : ప్రసిద్ధ శైవ క్షేత్రంగా పేరొందిన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఆరు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు దేవస్థానం విద్యుత్ వెలుగులతో ఉత్సవ శోభను సంతరించుకున్నది. గట్టుపైనా, కింద ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గట్టు కింద శివుడి రూపంలో విద్యుత్ వెలుగులతో భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన నంది విగ్రహాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గట్టుపై భక్తులకు మౌళిక వసతులు, సదుపాయాలు కల్పించారు. నూతన మరుగుదొడ్లు, మంచినీటి ట్యాంకులు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. గుట్టపైకి వెళ్లేందుకు ఇరువైపులా కర్రలతో రెయిలింగ్ కట్టారు. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులను నడిపించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

**16న రాత్రి స్వామివారి కల్యాణం**

పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండపం కింద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికను రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి వారి కల్యాణానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ప్రభుత్వం తరపున తలంబ్రాల బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ ఈఓ నవీన్ తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆర్డీఓ రవి మంగళవారం పరిశీలించారు.